సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 31 । జనవరి । 2023



శ్రీ చక్ర శుభ నివాసా...
దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో పదవ రోజు సోమవారం చక్రస్నాన కార్యక్రమం వైభవంగా జరిగింది. - 8లో



అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ అరెస్ట్
అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అంతర్ జిల్లా నేరస్తుడిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.210
రెండోరకం	రూ.90	రూ.158

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 191 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

కుష్టురహిత సమాజం కోసం కృషిచేయాలి

రాయచోటి అర్బన్: కుష్టురహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖాధికారులతో కలసి కుష్టువ్యాధి పక్షోత్సవాల గోడపత్రాలను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వరకు జిల్లావ్యాప్తంగా స్పర్శ కుష్టు వ్యాధి అవగాహన, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో సచివాలయం, పాఠశాలల్లో గ్రామ సభలు నిర్వహించి కుష్టవ్యాధి నిర్మూలనకు సంబంధించి ప్రజలు ,విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మధుసూదన్‌రెడ్డి, జిల్లా సర్వైలెన్స్ అధికారి రియాజ్‌బేగ్, అధికారులు విష్ణువర్దన్‌రెడ్డి, సుబ్బరాయుడు, పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

రాయచోటి అర్బన్ : జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష 2023-24 కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు జవహర్ నవోదయ విద్యాలయ వలసపలె, చిత్తూరు జిల్లా ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించే పరీక్షకు జనవరి 31వతేదీ వరకు గడువు ఉండేదన్నారు. విద్యార్థుల కోరిక, సౌకర్యార్థం ప్రభుత్వం ప్రవేశపరీక్ష గడువును ఫిబ్రవరి 8 తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

హంద్రీ-నీవా పనుల పూర్తికి రూ.180 కోట్లతో ప్రతిపాదనలు

– ఎస్‌ఈ రాజగోపాల్

బి.కొత్తకోట : అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల ప్రవంతి సాగు, తాగునీటి ప్రాజెక్టు రెండో దశలో అసంపూర్తిగా మిగిలిన పనులు పూర్తి చేయించేందుకు రూ.180 కోట్ల అంచనా తో ప్రభుత్వానికి నివేదించినట్లు ప్రాజెక్టు



మదనపల్లె ఎస్‌ఈ సీఆర్.రాజగోపాల్ చెప్పారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో సాగే ప్రధాన కాలువ కిలోమీటర్ 400 నుంచి 554 వరకు అసంపూర్తి పనులు మిగిలి ఉన్నాయని చెప్పారు. ఇందులోని స్ట్రక్చర్స్, జాతీయరహదారి క్రాసింగ్ పనులు పూర్తయితే రాయచోటి సమీపంలోని శ్రీనివాసపురం రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు తరలిస్తామని చెప్పారు. ప్రధాన కాలువ పనులు, 21వ ప్యాకేజీలో మిగిలిన 200 మీటర్ల కాలువ తవ్వకం పని, భూసేకరణకు కలుపుకొని రూ.123 కోట్లు అవసరమని నివేదిక పంపామన్నారు. అలాగే 63వ ప్యాకేజీలోని తంబళ్లపల్లె బ్రాంచ్ కెనాల్‌లోని అసంపూర్తి పనులకు రూ.11.87 కోట్లు, 64వ ప్యాకేజిలోని డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.13.04 కోట్లు, 65వ ప్యాకేజిలోని ఎల్లుట్ల డిస్ట్రిబ్యూటరీ పనులకు రూ.32.35 కోట్లు కావాలని నివేదించామని తెలిపారు. రూ.1912 కోట్లతో చేపట్టే పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉందన్నారు. పుంగనూరు ఉపకాలువకు గత వర్షాలకు గండ్లు పడ్డాయని వాటిని పూడ్చే పనులు సాగుతున్నాయన్నారు. చిత్తూరుజిల్లా పుంగనూరు నియోజకవర్గంలో రూ.30లక్షలతో పుంగనూరు ఉపకాలువకు గండ్లు పూడ్చే చర్యలు చేపట్టామన్నారు. కుప్పం ఉపకాలువలో మిగిలిన అసంపూర్తి పనులు వేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే 40శాతం పనులు పూర్తి చేయించామని చెప్పారు. రూ.20 కోట్ల పనులు జరగ్గా, మరో రూ.30 కోట్ల పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.

లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ తమీమ్‌అన్సారియా, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు తదితరులు



వృత్తిదారులకు జగనన్న చేదోడు

- రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థికసాయం
- జిల్లాలో 12,551 మంది ఖాతాల్లోకి రూ. 12,55,10,000 జమ
- జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా

రాయచోటి : చేతి వృత్తిదారులకు 'జగనన్న చేదోడు' పథకం అండగా ఉంటోంది. ఈ పథకం కింద అన్నమయ్య జిల్లాలోని 12,551 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.12,55,10,000 జమ చేశారని జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా పేర్కొన్నారు. సోమవారం పల్నాడు జిల్లా వినుకొండ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మూడోవిడత 'జగనన్న చేదోడు' లబ్ధి మొత్తాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అన్సారియా, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి సందప్ప, వీఎస్‌డబ్ల్యూ ఏఓ మనోహర్ రాజు, మార్కెట్ యార్డు చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు దిన్నెపాడు రవిరాజు, ఏఎస్‌డబ్ల్యూఓ కృష్ణయ్య, అధికారులు, టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్న చేదోడు పథకం ద్వారా రజకులు, నాయీబ్రాహ్మణులు, టైలర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందని అన్నారు. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న వారికి ఇది ఎంతగానో ఉపయోగకరమన్నారు. ఏటా రూ.10 వేలు చొప్పున అందజేస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారులు తమ ఆదాయ వనరులను పెంచుకోవడానికి, ఇతర నిత్యావసరాల కొనుగోలు కోసం ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం జగనన్న చేదోడు పథకానికి సంబంధించి మూడో ఏడాది జిల్లాలోని 12,551 మందికి రూ.12,55,10,000లకు సంబంధించిన మెగా చెక్కును జేసీ చేతుల మీదుగా టైలర్లు, రజకులు, నాయీబ్రాహ్మణులు లబ్ధిదారులకు అందజేశారు.

గ్రామ స్వరాజ్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్న సీఎం



నా పేరు ఎస్.షబానా, రాయచోటిలో నివసిస్తున్నాను. నేను టైలర్ షాప్ నడుపుతున్నాను. జగనన్న ఇచ్చిన డబ్బులతో నా షాప్‌కు సంబంధించి కరెంట్ బిల్లు, టైలరింగ్ కావాల్సిన మెటీరియల్ కొనుగోలు చేస్తున్నా. ఇంటింటికీ పాలన అందిస్తూ గ్రామ స్వరాజ్యాన్ని ప్రత్యక్షంగా చూపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– ఎస్.షబానా, టైలర్, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా

మా జీవితాల్లో వెలుగులు నింపారు



నా పేరు డి.లోకేష్. రాయచోటి, కె.రామాపురం. ల్యాండ్రీ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాను. 2023 ఆర్థిక సంవత్సరంలో మాలాంటి వారి కష్టాలను చూసి సీఎం జగనన్న చేదోడు పథకాని శ్రీకారం చుట్టారు. రూ.10 వేలు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కరెంటు బిల్లు కూడా ఆ డబ్బులతో కట్టుకున్నాను. మాలాంటి జీవితాలో జగనన్న వెలుగులు నింపారు.

– డి.లోకేష్, డ్రైక్లీనర్స్, కె.రామాపురం, రాయచోటి మండలం, అన్నమయ్య జిల్లా

జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం



నా పేరు డి.నాగభూషణం. నేను రాయచోటి పట్టణంలో హెయిర్ స్టైల్ కటింగ్ షాప్ నడుపుతున్నాను. పేదలు, వృత్తిదారులు, అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. జగనన్న చేదోడు పథకం కింద రూ.10 వేల ఆర్థికసహాయాన్ని ప్రభుత్వం అందించింది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– డి.నాగభూషణం, బార్బర్, రాయచోటి పట్టణం, అన్నమయ్య జిల్లా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులతో మాట్లాడుతున్న రైతు సాధికార సంస్థ రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి

రామాపురం : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కో ఆర్డినేటర్ కర్నాటి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పంట పొలాలను మండల ప్రకృతి వ్యవసాయ యాంకర్ సూరం వెంకటరామిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులు ఆర్థికాభివృద్ధి చెందుతారని, అదే విధంగా భూమి ఆరోగ్యం బాగు పడుతుందని చెప్పారు.అందువల్ల ఈ వ్యవసాయాన్ని ప్రోత్సహించి అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.అనంతరం చిట్లూరు రైతుభరోసా కేంద్రాన్ని (ఆర్‌బీకే) సందర్శించారు కార్యక్రమంలో డీపీఎం రమేష్‌బాబురావు, ఎస్ఎఫ్ఎఫ్ చంద్ర, ఎంఏఓ నాగమణి, ఎమ్‌టీఎల్ఎవన్ వెంకట్రామిరెడ్డి, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూముల గుర్తింపు
వేగంగా పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : రాయచోటి డివిజన్‌లో ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల గుర్తింపును శరవేగంగా పూర్తి చేసి నివేదికను అందజేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తహసీల్దార్లను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రాయచోటి డివిజన్‌కు సంబంధించి అసైన్‌మెంట్ భూములు, రీ-సర్వే, ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శ్మశాన వాటికలకు స్థలాల గుర్తింపు, క్లరికల్ కరెక్షన్స్ ఆఫ్ మాడ్యుల్స్ డిజిటల్ సిగ్నేచర్ స్టేటస్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఆర్డీఓ, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ డివిజన్‌లోని రామాపురం, గాలివీడు మండలాల్లో భూముల గుర్తింపు ప్రగతి బాగుందన్నారు. సంబేపల్లె, లక్కిరెడ్డిపల్లె మండలాలు భూముల గుర్తింపు, ఫైల్స్ రూపొందించే ప్రక్రియ ప్రగతిలో వెనుకబడి ఉన్నారని, త్వరితగతిన గుర్తింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల్లో భూముల గుర్తింపు స్వయంగా పర్యవేక్షణ చేయాలని ఆర్డీఓకు సూచించారు. ప్రభుత్వ భూమి ఒక్క సెంటు కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని తహసీల్దార్లకు ఉద్బోధించారు. ప్రతి మండలంలో గ్రామాల వారీగా, సర్వే నంబర్ల వారీగా ప్రభుత్వ భూమిని గుర్తించి నివేదిక పంపాలన్నారు. రీసర్వే అంశంలో భాగంగా గ్రామాల్లో మాడ్యుల్స్ అన్ని పక్కాగా పూర్తి చేయాలని చెప్పారు. రామాల్లో ఒక మాడ్యూల్, రెండు మాడ్యూల్స్ పెండింగ్‌లో ఉన్న వాటి సర్వేను పూర్తి చేయాలని సంబంధిత తహసీల్దార్లను, రీసర్వే అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో ఎస్సీ, ఎస్టీ కాలనీలకు శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించాలన్నారు. జిల్లాలోని 288 గ్రామాల్లో 181.59 ఎకరాలను గుర్తించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సమీక్ష సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ తదితరులు పాల్గొన్నారు.

- మ్యుటేషన్స్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో మ్యుటేషన్ పెండింగ్ దరఖాస్తులు, ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ, గడప గడపకు మన ప్రభుత్వం పనుల పురోగతి తదితర అంశాలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ దరఖాస్తులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సర్వే 75శాతం చేశారన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓ రంగస్వామి, సిపిఓ కృష్ణానాయక్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, ఆయా మండలాల తహశీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమీషనర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్

ఔత్సాహిక యువ క్రీడాకారులకు సువర్ణావకాశాలు కల్పించాలన్న సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) నాలుగో సీజన్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈ పోటీలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

- నేడు ప్రారంభ వేడుకలు
- జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు

కడప స్పోర్ట్స్ : సాక్షి ప్రీమియర్ లీగ్-2023 క్రికెట్ టోర్నమెంట్ జనవరి 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు సీనియర్ విభాగం, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు, 11 గంటలకు , మధ్యాహ్నం 2 గంటలకు చొప్పున రెండు మైదానాల్లో సమాంతరంగా మ్యాచ్‌లు జరగనున్నాయి. జిల్లాస్థాయిలో నిర్వహించే ఈ మ్యాచ్‌లు 10 ఓవర్ల చొప్పున నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నారు. క్రికెట్ నిబంధనలు అనుసరించి పోటీలు నిర్వహిస్తారు. మ్యాచ్ నిర్వహించే సమయంలో క్రీడాకారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్‌గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్‌డ్రస్, వైట్ షూస్‌లతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. ఆయా జట్లకు ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సంబంధిత కళాశాల ఐడెంటిటీ కార్డు, స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి సర్టిఫికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలన్నారు. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

నేటి మ్యాచ్‌ల వివరాలు

కేఎస్ఆర్ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : ప్రభుత్వ పాలిటెక్నిక్, వేంపల్లి- ప్రభుత్వ పాలిటెక్నిక్-1, ప్రొద్దుటూరు. (జూనియర్ విభాగం)

ఉదయం 11 గంటలకు : కేఓఆర్ఎం, కడప -ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల, ప్రొద్దుటూరు

మధ్యాహ్నం 2 గంటలకు : నిర్మల ఫార్మసి కళాశాల, కడప -జీఎస్‌టీయూ, పులివెందుల

కేఓఆర్ఎం మైదానంలో..

ఉదయం 9 గంటలకు : ప్రభుత్వ పాలిటెక్నిక్-2, ప్రొద్దుటూరు - ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ

ఉదయం 11 గంటలకు : డాక్టర్ వైఎస్ఆర్ ఏఏఫ్‌యూ, కడప- సీబీఐటీ, ప్రొద్దుటూరు

గాంధీ మార్గం అనుసరణీయం

రాయచోటి : జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గాన్ని మనమందరం అనుసరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అభిప్రాయపడ్డారు. సోమవారం మహాత్మగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమీపంలోని గాంధీజీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ మనదేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిన గొప్పవ్యక్తి గాంధీజీ అన్నారు.కార్యక్రమంలో రాయచోటి తహసీల్దార్ రవి శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి ఎస్పీ ఘన నివాళి

జాతిపిత మహాత్మాగాంధీ చూపిన మార్గాన్ని మనమంతా అనుసరించాలని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరంఎస్పీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడిన గొప్ప వ్యక్తి గాంధీజి అన్నారు.



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా తదితరులు



గాంధీజీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించాలి

డీఈఓ రాఘవరెడ్డి

రాయచోటి అర్బన్ : జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించాలని డీఈఓ రాఘవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఐకే పాఠశాల వద్ద వినయ్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ఐపీఎల్ క్రికెటర్ హరిశంకర రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల కోసం కబడ్డీ టోర్నమెంట్‌ను నిర్వహిస్తుండటం అభినందనీయమని అన్నారు.మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తోందన్నారు. క్రీడాకారుల కోసం అబ్బవరం వద్ద కొత్తగా స్టేడియం నిర్మించనున్నట్లు చెప్పారు టోర్నమెంట్ ఆర్గనైజర్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ పోటీలలో మొత్తం 22 జట్లు పాల్గొంటున్నాయన్నారు కార్యక్రమంలో ఐకె పాఠశాల కరస్పాండెంట్ ఇషాక్‌అలీ, ఉపాధ్యాయ సంఘం నేత శ్రీనివాసరాజు, హెచ్ఎం నరసింహారెడ్డి, వీరాంజనేయులు, రమేష్‌బాబు, లలితమ్మతో పాటు పలువురు క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో డీఈఓ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

- మార్క్‌ఫెడ్ ద్వారా మినుము, శనగ కొనుగోలు
- పశువుల బీమా మంజూరుకు చర్యలు
- రూ. 27 కోట్లతో సీపీడబ్ల్యు ఎస్ స్కీమ్స్
- వ్యవసాయానికి 'ఉపాధి'తో అనుసంధానం
- జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

జిల్లాను అభివృద్ధిలో ఆదర్శంగా నిలుపుదాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కనుక అన్ని రంగాలలో ఆదర్శంగా నిలపాల్సిన అవసరం ఉందని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతిపథంలో నడిపేందుకు కృషి చేస్తానన్నారు. సోమవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమావేశంలో చర్చ జరిగింది. మినుములు, బుడ్డశనగల కొనుగోలులో దళారుల పాత్ర నిరోధించేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే జిల్లాలో 26 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అధికారులు ఇప్పటికే చర్యలు చేపట్టారని వెల్లడించారు. జిల్లాలో వ్యవసాయం తర్వాత అధిక శాతం మంది పాడి పరిశ్రమపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మృతి చెందిన పాడి ఆవులు, గేదెలతోపాటు గొర్రెలకు బీమా సకాలంలో అందేవిధంగా అధికారుల ద్వారా చర్యలు చేపడతామన్నారు. 2023-24 సంవత్సరానికిగాను 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సీపీడబ్ల్యుఎస్ పనులను గుత్తేదారులకు అప్పగిస్తున్నామని తెలిపారు. రాజంపేట డివిజన్‌లో రూ. 8.35 కోట్లతో తొమ్మిది పనులు, పులివెందుల డివిజన్‌లో రూ. 11 కోట్లతో ఏడు పనులు, కడప డివిజన్‌లో రూ. 7.51 కోట్లతో ఆరు పనులు వెరసి రూ. 27,01,95,000తో 22 పనులు చేపడుతున్నామని వివరించారు. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలంటూ కేంద్రానికి ప్రతిపాదన పంపాలని సమావేశంలో తీర్మానిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ బిల్లుల చెల్లింపు : జిల్లా ఇన్‌చార్జిమంత్రి

సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్, బల్క్‌మిల్క్ చిల్లింగ్ సెంటర్ల భవన నిర్మాణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను త్వరలో చెల్లిస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్ హామీ ఇచ్చారు. తాగునీటి రవాణాకు సంబంధించిన బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నది గనుక పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను బడ్జెట్ సమావేశాలు ప్రారంభంలోపే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వైఎస్సార్ పశు బీమా పథకం కోసం ప్రభుత్వం ఒక నిధిని కూడా ఏర్పాటు చేసిందన్నారు. పశు బీమా కింద 15 రోజుల్లో పరిహారం ఇస్తామన్నారు. సచివాలయాల్లో, స్పందన కార్యక్రమంలో, ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చిన అర్జీలను గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులను గౌరవించాలంటూ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు.

ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమం ఆగదు : ఉప ముఖ్యమంత్రి

రాష్ట్రం ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాల అమలును కొనసాగిస్తారని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. బడ్జెట్ సమావేశాలకు ముందే ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులు చెల్లిస్తామన్నారు. మిగతా జిల్లాలతో పోలిస్తే కడపలోనే బిల్లుల చెల్లింపు మిన్నగా ఉందని పేర్కొన్నారు.

సభ దృష్టికి సమస్యలు..

సమావేశంలో పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు తమ మండలాల పరిధిలోని సమస్యలను ఏకరువు పెట్టారు. కో ఆప్షన్ సభ్యుడు కరీముల్లా మాట్లాడుతూ పసుపు పంట వచ్చిన వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. తమ మండలంలో పత్తి పంట సాగు చేసి తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి కోరారు. దళారుల దోపిడీని అరికట్టేందుకు మామిడి పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి కోరారు. ప్యాక్‌హౌస్ యూనిట్ కాస్ట్ పెంచాలని, సబ్సిడీ కేవలం రూ. 2 లక్షలు ఇవ్వడం అన్యాయమని వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి అన్నారు. సర్వరాయసాగర్, వామికొండ రిజర్వాయర్ల నీటి లీకేజీల కారణంగా నష్టపోయిన ఉద్యాన రైతులను ఆదుకోవాలని వీఎన్ పల్లె ఎంపీపీ కోరారు. బద్వేలు నియోజకవర్గంలో మూడేళ్లుగా రైతులకు డ్రిప్ పరికరాలు అందడం లేదని కాశినాయన జెడ్పీటీసీ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. పశువులు గాలికుంటు వ్యాధి బారిన పడుతున్నా ఆస్పత్రుల్లో మందులు లేవని చెన్నూరు ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్ తెలిపారు. పాడి ఆవులు చనిపోతే రెండేళ్లయినా బీమా అందలేదని, కొత్త ఆవులను కొనుగోలు చేసేందుకు రైతులకు ఇబ్బందిగా ఉందని చక్రాయపేట జెడ్పీటీసీ అన్నారు. రెండేళ్లుగా గొర్రెలకు బీమా అందడం లేదని వేంపల్లె జెడ్పీటీసీ తెలిపారు. పోరుమామిళ్ల ఆస్పత్రిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌తో ఇన్‌స్పెక్షన్ చేయించాలని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ కోరారు. పీఆర్‌అండ్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజాప్రతినిధులను గౌరవించడం లేదన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయా శాఖల అధికారులు సమాధానమిచ్చారు. సమావేశంలో తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సమావేశంలో రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు విజయరామరాజు, గిరీషా పీఎస్, వైఎస్సార్ జిల్లా జేసీ సాయికాంత్‌వర్మ, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు తిరుపాల్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

పీలేరు రూరల్ : స్థానిక వారపు సంత ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ నరసింహుడు కథనం మేరకు వివరాలిలా వున్నాయి. సోమవారం ఉదయం వారపు సంత ఆవరణలో ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు 50 ఏళ్లు ఉండవచ్చు.
అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 9440796744, 9440796745 అనే ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

శివాలయంలో సంచరిస్తున్న నాగసర్పం



రామాపురం : మండల పరిధి కల్పనాయినిచెరువు సమీపంలోని శివాలయంలో వారం రోజుల నుంచి నాగుపాము సంచరిస్తోందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ శివాలయం పూర్వ కాలం నాటిది. ఇటీవలే పునర్నిర్మించారు. ఇక్కడ సంచరిస్తున్న నాగసర్పాన్ని చూడటానికి చుట్టుపక్కల ప్రజలు ఆలయానికి తరలివస్తున్నారు. ఏటా మాఘమాసంలో ఇలా జరుగుతోందని గ్రామస్తులు తెలిపారు.

108 వాహనంలో ప్రసవం



బిడ్డను కుటుంబ సభ్యులకు ఇస్తున్న 108 సిబ్బంది

ములకలచెరువు : 108 వాహనంలో ఓ మహిళ సోమవారం తెల్లవారుజామున ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. 108 సిబ్బంది శివకుమార్, చిరంజీవి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోటకు చెందిన పి.తులసి పురిటి నొప్పులతో ఉండగా కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే వచ్చిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి కు తరలిస్తుండగా మార్గమధ్యలో వేపూరికోట వద్దకు చేరుకోగానే పురిటి నొప్పులు ఎక్కువ అయ్యాయి. 108 సిబ్బంది ప్రసవం చేయించారు. ఆడబిడ్డ, బాలింత క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది వెల్లడించారు.

వివాహితకు పాముకాటుతో అస్వస్థత

మదనపల్లె : పాము కాటుతో వివాహిత తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన సోమవారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. రెడ్డికోట గ్రామానికి చెందిన శివ భార్య సుకన్య(21) టమాట పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

శ్రీ చక్ర శుభ నివాసా..

వైభవంగా చక్రస్నానం



స్వామి, అమ్మవార్లు, చక్రత్తాళ్వార్‌కు చందనాభిషేకం



చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు



హంస వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదవ రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు అవభృథ స్నానం, సుదర్శన చక్ర తాళ్వార్‌కు తీర్థస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం నుంచి మేళతాళాలతో ప్రత్యేక పల్లకీలో స్వామి, అమ్మవార్లతోపాటు శ్రీ చక్రాన్ని ఊరేగింపుగా పుష్కరిణి మండపానికి చేర్చారు. అక్కడ రెండున్నర గంటలపాటు వేద మంత్ర యుక్తంగా స్వామి, అమ్మవార్లకు పంచామృతంతోపాటు ఇతర ద్రవ్యాలతో కూడా అభిషేకించారు.

ధ్వజావరోహణం

ఆలయ ప్రాంగణం నుంచి శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా పుష్కరిణి వద్ద గల మంటపానికి చేర్చారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత చందన లేపనం, నారికేళ జలాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మచ్చా శేషాచార్యులు, మయూరం కృష్ణమోహన్, త్రివిక్రమ్, కృష్ణమూర్తి తదితరులు పాలు, పెరుగు, తేనె, శుద్ధ జలాలతో అభిషేకం చేశారు. వివిధ రకాల సుగంధ ద్రవ్యాల మాలలతో ప్రత్యేకంగా కూర్చిన దండలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను చక్ర తాళ్వార్‌తో పాటు పుష్కరిణిలోకి తీసుకెళ్లారు. గోవిందనామ స్మరణలు, భక్తుల కోలాహలం మధ్య మూలమూర్తులతో సహా అర్చకులు పుష్కరిణిలో మూడు మునకలు వేశారు. భక్తులు తాము కూడా పుష్కరిణిలో మునకలు వేసి పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను అలంకరించి ఊరేగింపుగా ఆలయానికి చేర్చారు. హాజరైన భక్తులకు స్వామి ప్రత్యేక ప్రసాదంగా ఉత్సవమూర్తులకు లేపనం చేసిన సుగంధం, తీర్థ ప్రసాదాలను అందజేశారు. తర్వాత రాత్రి వేద మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణంలో గరుడ పతాకాన్ని ధ్వజావరోహణం చేశారు. రాత్రి హంస వాహనంపై స్వామిని వీణాపాణిగా అలంకరించి కొలువుదీర్చారు. ఊరేగింపుగా పల్లకీలో తిరుమాడ వీధుల్లో అమ్మవారు భక్తులను కరుణించాడు.

నేడు పుష్పయాగం

బ్రహ్మోత్సవాలు ముగిసిన సందర్భంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 నుంచి 7 గంటల్లోపు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమాచార్యుల కీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల్లోపుగా ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి సన్నిధిలో పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు తెచ్చే పూలను కూడా పుష్పయాగంలో ఉపయోగించనున్నారు.

అంతర్ జిల్లా చైన్‌స్నాచర్ అరెస్ట్

రూ.4 లక్షల విలువైన బంగారం స్వాధీనం



నిందితుడిని చూపుతున్న రూరల్ సీఐ, ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

మదనపల్లె : అనంతపురం, చిత్తూరు, అన్నమయ్య, కర్నూలు, తిరుపతి జిల్లాల్లో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన అంతర్ జిల్లా నేరస్తుడిని నిమ్మనపల్లె పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. అతడి వద్ద నుంచి రూ.4 లక్షలు విలువ చేసే 82 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. మదనపల్లె తాలుకా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మదనపల్లె రూరల్ సీఐ శివాంజనేయులు వివరాలు వెల్లడించారు. అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణం గంగానగర్ కాలనీకి చెందిన సయ్యద్ జాకీర్ హుస్సేన్ కుమారుడు షేక్ ముస్లిం(33)కు తొమ్మిదేళ్ల క్రితం అన్నమయ్యజిల్లా వాల్మీకిపురానికి చెందిన ఎస్.నఫీసాతో వివాహం జరిగింది. సోమవారం ఉదయం నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మోటార్‌సైకిల్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి బండి వెనక్కు తిప్పుకొని పారిపోయారు. దీంతో పోలీసులు వారిని వెంబడించగా, బండిలో కూర్చున్న గుంతకల్ టౌన్ గంగానగర్‌కు చెందిన షేక్ అబ్బాస్ పోలీసులను చూసి బైక్ నుంచి దూకి పారిపోయాడు. బైక్ నడుపుతున్న షేక్ ముస్లిం పోలీసులకు దొరికాడు. పోలీసులు తనిఖీ చేయగా జేబులో బంగారు నగలు దొరికాయి. విచారణ చేయగా తాను, తన స్నేహితుడు షేక్ అబ్బాస్ చైన్‌స్నాచింగ్‌లు చేస్తుంటామని, దొంగిలించిన ఆభరణాలు అమ్మగా వచ్చిన డబ్బులతో జల్సా చేస్తుంటామని చెప్పాడు. తిరుచానూరు, గాజులమండ్యం, పలమనేరు, గుంతకల్లు, పీలేరు పోలీస్‌స్టేషన్‌లలో తమపై 22 కేసులు ఉన్నాయని చెప్పారు. నిమ్మనపల్లె, రామసముద్రం, మదనపల్లె టూటౌన్ పోలీస్ స్టేషన్‌లలో చైన్‌స్నాచింగ్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు అంగీకరించాడు. సమావేశంలో ఎస్ఐ ఫాతిమా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో జీవిత ఖైదు

రాజంపేట : వరుసకు తమ్ముడిని చంపిన కేసులో అన్నకు జీవిత ఖైదు పడింది. దేశబోయిన సుబ్రమణ్యం హత్య కేసులో దేశబోయిన చంద్రశేఖర్‌కు జడ్జి ఆర్‌వీవీఎస్ మురళీకృష్ణ జీవితఖైదు విధించడంతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ నిజామ్ జానీ వెల్లడించారు. ఆయన సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. 2019లో మన్నూరు పోలీసుస్టేషన్ పరిధిలో నివసిస్తున్న దేశబోయిన సుబ్రమణ్యం రోజూ తాగి వచ్చి తన కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. 2019 జూన్ 7న కూడా అతను తన భార్య, కుటుంబ సభ్యులను బూతులు తిడుతూ ఉన్నాడు. సుబ్రమణ్యం ఇంటికి చంద్రశేఖర్ వెళ్లి తాగి తిట్టడం సరైంది కాదంటూ సముదాయించే ప్రయత్నం చేశాడు. అయినా వినలేదు. అప్పటికే వారి మధ్య మనస్పర్థలు ఉండటంతో సుబ్రమణ్యంను చంపాలనే ఉద్దేశంతో చంద్రశేఖర్ కత్తి తీసుకుని పొడిచి చంపాడు. ఈ కేసులో సాక్ష్యాలు రుజువు కావడంతో జడ్జి మురళీ కృష్ణ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు 1000 రూపాయల జరిమానా విధించారు.

ఆర్టీసీ బస్సులు ఢీ..

స్వల్ప గాయాలతో బయట పడిన ప్రయాణికులు

ఒంటిమిట్ట : మండల పరిధి మంటపంపల్లి గ్రామ పంచాయతీలోని ఇరుకురాళ్ళబోటు సమీపాన ఉన్న జాతీయ రహదారిపై సోమవారం ఉదయం రెండు ఆర్టీసీ బస్సులు ఢీ కొన్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప నుంచి తిరుపతి వైపు వెళ్తున్న బస్సు ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి రాజంపేట నుంచి కడప వైపు వెళ్తున్న బస్సును ఢీకొంది. ఈ రెండు బస్సుల్లోని ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. పెను ప్రమాదమే తప్పిందని వారు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జి.శివభాస్కరరెడ్డి

రాజంపేట రూరల్ : మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ జి.శివభాస్కరరెడ్డి తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సి.నరసింహులు, ఎస్ఐ ఎం.భక్తవత్సలంతో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుడిని హాజరు పరిచి, వివరాలు వెల్లడించారు. ఈ నెల 24న ఉదయం వెంకటరాజంపేట వద్దనున్న పెట్రోల్ బంకు సమీపంలో ఒక మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందింది. హతురాలి పేరు సాకే కళావతి. ఈమెది అనంతపురం జిల్లాలోని కదిరి మండలంలో గల బత్రేపల్లి గ్రామం. తన భర్త సాకే గంగాద్రితో కలిసి కడపలోని భవాని నగర్‌లో జీవనం సాగిస్తోంది. కర్ణాటక రాష్ట్రంలోని కొప్పళ జిల్లాలో గల కుస్తగి తాలుకాకు చెందిన కోరుడకేరా గ్రామానికి చెందిన కాలకయ్య గురివిఎస్ కుమారుడు మంజునాథ గురివిఎస్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతను ఎంఎస్‌పీఎల్ పెల్లెంట్ ప్లాంట్ ఫ్యాక్టరీలో ఓర్ పెల్లేట్స్ లోడు చేసుకొని శ్రీకాళహస్తికి వెళ్లేందుకు ఈ నెల 24న వెంకటరాజంపేట సమీపానికి వచ్చాడు. అక్కడ కళావతి, డ్రైవర్ మంజునాథ మధ్య డబ్బు విషయంలో గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆమె అతన్ని చెంపపై కొట్టింది. అతను చుట్టు పక్కల ఎవరూ లేరని నిర్ధారించుకొని ఆమెను గొంతు నులిమి చంపేశాడు. మృతురాలి కుమారుడు సాకే శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మంజునాథను ఈ నెల 29న అనంతపురం జిల్లా గుంతకల్ టౌన్ పరిధిలోని గుంతకల్-బళ్లారి మెయిన్ రోడ్‌లో అరెస్టు చేశారు. నిందితుడు నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి లారీతోపాటు సెల్‌ఫోన్, లోడ్‌కు సంబంధించిన బిల్లులు, షర్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసును చాలెంజ్‌గా తీసుకొని టెక్నాలజీ సాయంతో అతి తక్కువ కాలంలో ఛేదించి, నిందితుడిని అరెస్టు చేసినందుకు ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ పుల్లయ్య, ఎస్ఐ భక్తవత్సలం, హెడ్ కానిస్టేబుల్ నందకుమార్, కానిస్టేబుళ్లు అంజిరెడ్డి, చంద్రమోహన్‌ను ప్రశంసిస్తూ రివార్డు అందజేశారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : స్పందన ద్వారా అందుతున్న ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్పందనకు 35 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి ఫిర్యాదులు గురించి సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి స్పందన కార్యక్రమంలో వచ్చే ప్రతి అర్జీ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే చట్ట ప్రకారం విచారణ జరిపి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఎస్పీ ఆదేశించారు.

సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



అరుణాదేవికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో మరణించిన సీఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ అరుణాదేవికి సోమవారం కొత్తవారిపల్లె పంచాయతీ రాయనచెరువు వడ్డిపల్లెలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర సరిహద్దుల్లో సీఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అరుణాదేవి తన కుమారుడిని వడ్డిపల్లెలో విడిచిపెట్టి విధులకు వెళుతుండగా శనివారం శానిటోరియం వద్ద ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి మరణించారు. అరుణాదేవి భర్త రవీంద్ర జమ్మూకశ్మీర్‌లో ఆర్మీ హవల్దార్‌గా పని చేస్తున్నారు. భార్య చివరి చూపు కోసం ఆయన రావాల్సి ఉండటంతో అరుణాదేవి మృతదేహాన్ని రెండు రోజుల పాటు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. భర్త రవీంద్ర ఆదివారం రాత్రి మదనపల్లెకు చేరుకోవడంతో సోమవారం ఉదయం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం రాయన చెరువు వడ్డిపల్లెలో సీఆర్పీఎఫ్ మహిళా కానిస్టేబుల్ అరుణాదేవికి పోలీసులు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్ఐ సుధాకర, సీఆర్పీఎఫ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం ముగ్గురు ఆత్మహత్యకు ప్రయత్నించారు. మండలంలోని కొత్తపల్లికి చెందిన శ్రీరాములు భార్య జి.రోహిత(28) కుటుంబ సభ్యులతో గొడపడి ఆదివారం రాత్రి పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు తిరుపతి రూయా ఆస్పత్రికి రెఫర్ చేశారు.

- పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన జె.ఆంజనేయులు భార్య జె.శాంతమ్మ (35) కుటుంబ సమస్యల కారణంగా విష జంతువుల నివారణ మందు తిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.
- మాలేపాడు గ్రామం ఆవులపల్లికి చెందిన ఇంటర్మీడియెట్ చదువుతున్న బాలిక (17) తల్లి మందలించిందని సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. ఇంటి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెందిద బాలిక పురుగుల నివారణ మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె తాలూకా పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా తాగి ఇద్దరు మృతి






నాటుసారా తాగి మృతిచెందిన రమణ, రవి

మదనపల్లె : మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో నాటుసారా తాగి ఇద్దరు మృతి చెందారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె పుల్లారెడ్డివీధి పాత ఊరులో నివాసం ఉంటున్న రామచంద్ర కుమారుడు జె.రవి(40), వెంకటరమణ కుమారుడు ఎస్.రమణ(48) పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. రవి స్వగ్రామం బి.కొత్తకోట మండలం మద్దయ్యగారిపల్లె కాగా, రమణ స్వగ్రామం పెద్దమండ్యం మండలం వెలిగల్లు. పదేళ్ల క్రితం ఉపాధి కోసం మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు వచ్చి స్థిరపడ్డారు. వీరిలో రవి చేనేతకార్మికుడిగా పనిచేస్తూ సారాకు బానిసై గత రెండేళ్లుగా పనిమానేశాడు. ఇతడికి భార్య అనితతో పాటు ఒక కుమార్తె ఒక కుమారుడు ఉన్నారు. రమణ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య సరోజమ్మ కుమార్తె దీపిక ఉన్నారు. సోమవారం రాత్రి 7గంటల సమయంలో రవి, రమణ కలిసి స్థానికంగా మంగమ్మ, రెడ్డిలక్ష్మి, వంశీ కలిసి విక్రయిస్తున్న నాటుసారాను కొనుగోలుచేసి తాగారు. తాగిన పదినిమిషాలలోనే అపస్మారక స్థితికి చేరుకున్నారు. హఠాత్తుగా వీరిద్దరికీ వాంతులతో పాటు నోటిలో నురుగ రావడంతో అక్కడికక్కడే పడిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన 7.40 గంటలకు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతికి కారణాలు అడిగితే మద్యం తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నట్లు చెప్పారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాలను జిల్లా ఆస్పత్రి నుంచి కుటుంబ సభ్యులు వారి స్వగ్రామాలకు తరలించారు.

బతుకుదెరువు కోసం వెళ్లి.. కానరాని లోకానికి..



శ్రీనివాస్ (ఫైల్)

రామసముద్రం : బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతానికి వెళ్లిన ఓ వ్యక్తి కానరాని లోకానికి వెళ్లిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామసముద్రం బోయవీధిలో కాపురం ఉండే మేస్త్రీ చంద్రశేఖర్ కుమారుడు శ్రీనివాసులు(19) కొంత కాలంగా బెంగళూరులో ఓ యజమాని దగ్గర కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం యజమాని కుటుంబంతో కలిసి బెంగళూరు సమీపంలోని గంగానది తీర్థయాత్రల కోసం వెళ్లారు. నదిలో యజమాని కుటుంబ సభ్యులలో ఒకరు ప్రమాదవశాత్తు కొట్టుకుపోతుండగా.. కాపాడేందుకు యజమానితో పాటు శ్రీనివాసులు నదిలోకి వెళ్లాడు. బాధితుడిని కాపాడి ఇద్దరూ ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ శ్రీనివాసులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడు. కుటుంబానికి ఆసరాగా ఉన్న కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని రామసముద్రానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో కార్మికుడికి గాయాలు

మదనపల్లె : ఎన్‌హెచ్ పనుల కోసం వచ్చిన కార్మికుడు విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం కలికిరి మండలంలో జరిగింది. బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా పచోర్ గ్రామానికి చెందిన ముఖేష్‌కుమార్ కుమారుడు అమన్‌కుమార్(24) జాతీయ రహదారి పనుల నిమిత్తం మూడు నెలల క్రితం జీఆర్ ఇన్‌ఫ్రా కంపెనీలో చేరి కలికిరి సమీపంలో పనులు చేస్తున్నాడు. సోమవారం పనుల్లో భాగంగా నిచ్చెన అమరుస్తుండగా, పైనున్న విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి కార్మికులు బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కలికిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.